## సర్పంచుల పనితీరు భేష్..

- చేసిన పనులకు ఎంబీలు చేసే బాధ్యత అధికారులదే..
- వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి

వికారాబాద్, జనవరి 29 : జిల్లాలో ఐదేండ్ల పదవీ కాలంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చేసిన కృషి మరువలేనిదని వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కొనియాడారు. వారి పని తీరు చాలా భేషుగ్గా ఉందని, జిల్లాలో చాలా మంది సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేశారన్నారు. రేపటితో సర్పంచుల పదవీకాలం ముగుస్తునందున బాగా కష్టపడి పనిచేసిన సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాంటి సర్పంచులకు సంబంధిత ఇంజినీర్లు, పంచాయతీ అధికారులు ఎంబీ రికార్డులు చేసి ఇవ్వాలని సూచించారు. వీరికి పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినట్లు గుర్తుచేశారు. ఎంతో మంది కష్టపడి గ్రామాలను ఉన్నతంగా తీర్చిదిద్దారని, కొన్ని గ్రామాల సర్పంచులు అప్పటి ఎమ్మెల్యేల అండతో అక్రమాలకు పాల్పడినట్లు మండిపడ్డారు. ప్రజా మద్దతు లేని అలాంటివారికి ఎవ్వరి మద్దతూ ఉండదని తేల్చిచెప్పారు. బషీరాబాద్ మండలం బాద్లాపూర్ సర్పంచ్ నీలీబాయి అభివృద్ధి చేసి అప్పులపాలై అడ్డమీద కూలీ పనిచేయడం తనను ఎంతగానో బాధించిందని పేర్కొన్నారు. ఇలాంటి సర్పంచ్‌లు జిల్లాలో ఎంతోమంది ఉన్నారన్నారు. ఇలా చాలా మంది సర్పంచులు కూలీ పనులు, వ్యవసాయ పనులు చేశారన్నారు. అధికారులు పదవీ విరమణ చేసిన తర్వాత ఎలాగైతే సన్మానిస్తామో.. అలాగే గ్రామాల అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసిన సర్పంచులను కూడా సన్మానించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వారి సేవలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఆమె పేర్కొన్నారు.

### బెంచీల ఏర్పాటుకు రూ.5 లక్షల విరాళం

చేవెళ్ల రూరల్, జనవరి 29 : చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫర్నిచర్‌ను ఏర్పాటు చేసేందుకు జడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి అంతకు ముందు చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో జడ్పీటీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులున్నారు.

# పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


కార్యకర్త రవి భార్య రమాదేవికి రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న కేటీఆర్, ఎంపీ రంజిత్‌రెడ్డి


మన్నెగూడలోని అతియా హోటల్‌లో చాయ్ తాగుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పరిగి, జనవరి 29 : ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పూడూరు మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి రవి ఇటీవల మృతిచెందగా ఆయన భార్య రమాదేవికి రూ.2లక్షల బీమా చెక్కును సోమవారం కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా రవి కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రవికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారని చెప్పగా వారి చదువుకు అండగా నిలుస్తామని, బాధపడరాదని సూచించారు. అంతకుముందు మీర్జాపూర్ గ్రామస్తులు పలువురిని కేటీఆర్ కలిసి మాట్లాడారు. మీర్జాపూర్‌కు చెందిన మమత కుమారుడు తనీష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని తల్లి చెప్పగా.. వైద్య సహాయం అందించేలా చూస్తామని భరోసా ఇచ్చారు. మీర్జాపూర్ గ్రామంలో పలువురు చిన్నారులు మొదలుకొని, పెద్దవారు సైతం కేటీఆర్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం కారులో వెళ్తుండగా చిన్నారులు కేటీఆర్‌ను చూసేందుకు రావడంతో కారు ఆపించి ఓ చిన్నారిని కేటీఆర్ ఎత్తుకున్నారు. అంతకుముందు మన్నెగూడలోని అతియా హోటల్‌లో కేటీఆర్ ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌లతో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా పలువురు కేటీఆర్‌ను కలిసి సెల్ఫీలు తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ గ్రామం నుంచి మెజార్టీ ఇవ్వనందుకు పార్టీ నాయకుడు శ్రీనివాస్ బాధపడగా ఓదార్చారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మల్లేశం, జడ్పీటీసీ మేఘమాల, సీనియర్ నాయకులు అనిల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అజహరుద్దీన్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న మీర్జాపూర్ గ్రామ మహిళ, చిన్నారులు


కేటీఆర్‌కు చిత్రపటం బహూకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

# ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి
- ఉమ్మడి జిల్లాలో 'ప్రజావాణి'లో ఫిర్యాదుల స్వీకరణ


ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 29 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి కచ్చితంగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ.. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 98 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### 205 ఫిర్యాదుల స్వీకరణ

వికారాబాద్, జనవరి 29 : ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖా


సమావేశానికి హాజరైన ఆయా శాఖల జిల్లా అధికారులు


ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

స్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి 205 ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేసి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మైనర్‌పై లైంగికదాడి.. 20 ఏండ్లు జైలుశిక్ష

### బాధితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు 20 ఏండ్లు జైలు శిక్ష విధించడంతో పాటు రూ.25 వేలు జరిమానా, బాధితురాలికి 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్పు వెల్లడించింది. అదనపు పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేశంపేటకు చెందిన మణికొండ మహేశ్ వనస్థలిపురంలోని వెంకటరమణ కాలనీలో సెలూన్ షాపులో బార్బర్‌గా పనిచేస్తుండేవాడు. తన చెల్లికి స్నేహితురాలైన మైనర్ బాలికను ప్రేమ పేరుతో లోబర్చుకొని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడు మహేశ్‌ను రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాలను పరిశీలించిన న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది.

## అక్రమ రవాణాపై నిఘా

- జిల్లా మైనింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్
- 181 కేసులు నమోదు
- స్పెషల్ డ్రైవ్‌లో రూ.18.82 లక్షల జరిమానా

ఇబ్రహీంపట్నం, జనవరి 29 : రంగారెడ్డి జిల్లాలో మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే గత కొన్ని రోజులుగా జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్న మట్టి, కంకర, ఇతరత్రా వాటిపై ప్రత్యేక నిఘా పెట్టారు. జిల్లా నుంచి హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, గ్రానైట్, ఇటుక, కంకర, ఇసుక నగరానికి రవాణా చేస్తున్నారు. గత 20 రోజులుగా జిల్లా మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో నిఘా పెంచి కంకర క్వారీలను అక్రమంగా నిల్వ చేసిన మట్టికుప్పలు వంటి వాటిని తనిఖీ చేశారు. మినరల్ స్టాక్ పాయింట్లను కూడా తనిఖీ చేశారు. ఇటీవలి కాలంలో 1249 వాహనాలను తనిఖీ చేయగా అక్రమంగా రవాణా చేస్తున్న పలు వాహనాల పై 181 కేసులు నమోదు చేసినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ వాహనాలపై చలాన్ల రూపేణా రూ.18.82 లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని ఆయన చెప్పారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యం

- నేడు కుష్టు వ్యాధి నివారణ దినం
- వికారాబాద్ జిల్లాలో రెండు వారాల పాటు అవగాహన కార్యక్రమాలు


కుష్టు వ్యాధిపై సర్వే చేస్తున్న ఆశా కార్యకర్తలు(ఫైల్)




బొంరాస్‌పేట, జనవరి 29 : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా ఏటా కేసులు పెరుగుతూనే ఉన్నాయి. చాప కింద నీరులాగా ఈ వ్యాధి విస్తరిస్తున్నది. కొంతమందికి వ్యాధి లక్షణాలున్నా సకాలంలో వైద్యం చేయించుకోవడానికి ముందుకు రావడంలేదని వైద్యశాఖ అధికారులు గుర్తించారు. కుష్టు వ్యాధికి ప్రభుత్వం దవాఖానల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్సను అందిస్తున్నారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయితే సమాజంలో చిన్నచూపు చూస్తారని, దూరంగా పెడతారని భయపడి కొందరు చూపించుకోరు. దీంతో వ్యాధి లక్షణాలున్నవారు ఏటేటా పెరుగుతున్నారు. వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ఏటా గాంధీజీ వర్ధంతి రోజైన జనవరి 30న కుష్టు వ్యాధి నివారణ దినంగా పాటిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకు జిల్లాలో కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

### నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు



కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి మంగళవారం నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కుష్టు వ్యాధి గ్రస్తులను దూరంగా ఉంచకుండా సమానంగా చూడాలని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిజ్ఞ చేయిస్తారు. గ్రామాల్లో విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో ర్యాలీలు నిర్వహించి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారు. వ్యాధి లక్షణాలున్నవారు మందులు తీసుకుంటే పూర్తిగా నయమవుతుంది. భయపడి చికిత్స చేయించుకోకుంటే చేతులు వంకర పోయి సమస్యలు వస్తాయి.

\- రవీంద్ర యాదవ్, కుష్టు వ్యాధి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

### వ్యాధి లక్షణాలు

స్పర్శలేని ఎర్రని రాగి రంగు, గోధుమ రంగు గల మచ్చలు శరీరంలో ఎక్కడైనా ఉంటే, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మొద్దుబారి ఉన్నచో కుష్టు వ్యాధిగా అనుమానించి ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలి. 1 నుంచి 5 మచ్చలున్నవారిని పీ.బీ కేసుగా, ఐదుకు పైగా మచ్చలుంటే వారిని ఎంబీ కేసులుగా పరిగణిస్తారు. ఇలా గుర్తించిన వారికి వైద్యశాఖ అధికారులు ఎండీటీ(బహుళ ఔషధ చికిత్స)విధానంలో మందులందించి చికిత్స అందిస్తారు. పీబీ వ్యాధిగ్రస్తులు ఆరు నెలలు, ఎంబీ వ్యాధిగ్రస్తులు 12 నెలలు మందులు తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుంది. శరీరంపై మచ్చలున్నా చికిత్స చేయించుకోకుంటే కుష్టు వ్యాధి తీవ్రమై అనేక సమస్యలకు దారి తీస్తుందని వైద్యారోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. చేతులు వంకర కావడం, అంగవైకల్యానికి దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం 84 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల్లో 15 మంది పీబీ, 69 మంది ఎంబీ వ్యాధిగ్రస్తులు. వీరు ప్రభుత్వ దవాఖానాల్లో మందులు తీసుకుని చికిత్స పొందుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీటీడీవో కోటాజీ

## నాలుగో తరగతి సిబ్బందికి శుభ్రతపై అవగాహన సదస్సు

వికారాబాద్, జనవరి 29 : గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులు అనారోగ్యంబారిన పడకుండా పరిశుభ్రమైన భోజనాలు అందించేందుకు కుక్, నాలుగో తరగతి సిబ్బందికి శుభ్రతపై ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించినట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి కోటాజీ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్, డైరెక్టర్ నరసింహారెడ్డి ఆదేశానుసారం సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాల వసతి గృహాల కుక్, నాలుగో తరగతి ఉద్యోగులకు వంట పద్ధతులు, ఆహార భద్రత, వసతి గృహాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వికారాబాద్ సీడీపీవో వెంకటేశ్వరి, వైద్యారోగ్యశాఖ మీడియా అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

## కలెక్టరేట్‌లో డెమో ఈవీఎంల ప్రదర్శన

వికారాబాద్, జనవరి 29 : ఈవీఎంలపై ఓటు హక్కు వినియోగించుకునే విధానాన్ని తెలియపరిచేలా కలెక్టర్ కార్యాలయంలో డెమో ఈవీఎంల ప్రదర్శనను వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డెమో ఈవీఎంపై ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనే విధానాన్ని కలెక్టర్ ఏవీఎంపై ఓటు వేసి తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంతోపాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఈవీఎం ప్రదర్శనశాలలను ఏర్పాటు చేసి ప్రజలకు దీనిపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, వివిధ శాఖల అధికారులున్నారు.

## జూనియర్ కళాశాల కోసం ఉన్నత పాఠశాల పరిశీలన

బొంరాస్‌పేట, జనవరి 29 : ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించడానికి బొంరాస్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి బొంరాస్‌పేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఇందులో భాగంగా మొదటి సంవత్సరం తరగతులను నిర్వహించడానికి ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలలో ఉన్న వసతి, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న గదుల గురించి ఆయన పాఠశాల జీహెచ్‌ఎం హరిలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ రవిచారి, సర్వేయర్ దేవేందర్ పాల్గొన్నారు.


ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

### గిరిజన గురుకుల పాఠశాల పరిశీలన

కొడంగల్, జనవరి 29 : మున్సిపల్ పరిధి పాతకొడంగల్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి సోమవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రూ.5.50 కోట్లతో ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మాణం చేపటనున్నామని, విద్యార్థులకు మౌలిక వసతులకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బలరాం, సర్వేయర్ మురళీధర్‌చారి, ఉపాధ్యాయులున్నారు.

## శభాష్ సిస్టర్స్

### స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు సాధించిన అక్కాచెల్లెళ్లు

### ఒకే కుటుంబంలో రెండు ఉద్యోగాలు


స్టాఫ్‌నర్స్ ఉద్యోగం సాధించిన ప్రభావతి, రేఖ

యాచారం, జనవరి 29 : ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం రావడమే ఎంతో గొప్పగా చెప్పుకోవచ్చు. కానీ అదే ఒకే ఇంట్లో ఇద్దరికి ఉద్యోగాలు వస్తే ఎంత గొప్పగా ఉంటుందో చెప్పాల్సిన అవసరంలేదు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి కష్టపడి ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తే ఆ కుటుంబంలో ఆ ఆనందమే వేరు. రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రానికి చెందిన భూతరాజు ముత్యాలు–భారతమ్మ దంపతులకు నలుగురు కూతుర్లు. ముత్యాలు ప్రభుత్వ దవాఖాపలో అటెండర్‌గా పనిచేసేవాడు. అటెండర్‌గా పనిచేస్తూ కూతుర్లకు మంచి చదువులు చదివించాడు. భారతమ్మ సైతం రజక కులవృత్తిని నమ్ముకొని బట్టలు ఉతకడంతో పాటు బట్టలను ఇస్త్రీ చేసి కుటుంబాన్ని పోషించేది. ఇటిటీవలే ముత్యాలు అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి రెండో కూతురు ప్రభావతి, నాలుగో కూతురు రేఖ గత కొంత కాలంగా కాంట్రాక్ట్ బేసిస్‌లో నర్స్ ఉద్యోగం చేసేవారు. స్టాఫ్ నర్స్‌కు సంబంధించి ఇద్దరు ఇటీవలే కష్టపడి పరీక్షలు రాశారు. ఆదివారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో 6వ జోన్లో వీరిరువురు ఉద్యోగం సాధించారు. ప్రభావతి, రేఖ ఉద్యోగాలు సాధించడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సందడిగా బోనాలు

మొయినాబాద్, జనవరి 29 : మండల పరిధిలోని ఎన్కేపల్లిలో రెండు రోజులుగా బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. డప్పుల దరువులు..డోలు వాయిద్యాలు.. యువకుల నృత్యాల మధ్య మహిళలు పెద్దఎత్తున బోనాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో సర్పంచ్ చందన, ఎంపీటీసీ రితీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆనంద్, ఏఎంసీ డైరెక్టర్ కుమ్మరి రాము, వార్డు సభ్యులు, నాయకులున్నారు.



## ఎన్‌వైకేఎస్ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా పసుల మహేశ్



మర్పల్లి, జనవరి 29 : నెహ్రూ యువకేంద్ర సంఘటన్ జిల్లా అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా మండలంలోని కల్‌ఖోడా గ్రామానికి చెందిన పసుల మహేశ్‌ను మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేంద్ర ప్రభుత్వం నామినేటెడ్ బాధ్యత ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థి స్థాయి నుంచి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నుంచి అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు. ఈ ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యతోనే ఉజ్వల భవిత

### ప్రముఖ మోటివేటర్, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేశ్వర్‌రావు

ఆమనగల్లు, జనవరి 29 : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ మోటివేటర్, ఇంపాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని భవాని గార్డెన్‌లో ట్రస్మా ఆమనగల్లు డివిజన్ ఆధ్వర్యంలో వాగ్దేవి జూనియర్ కళాశాల బాలాపూర్ సహకారంతో ఐదు మండలాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు తీసుకున్నారు. టెన్త్‌లో పది పాయింట్లు సాధించేందుకు కావాల్సిన సూచనలు, సలహాలిచ్చారు. ఒత్తిడి లేకుండా చదవాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు బీరప్ప అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భువనగిరి ఫణి పవన్ శాస్త్రి, ట్రస్మా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తల్లోజు వెంకటయ్య, రాష్ట్ర ఈసీ మెంబర్ నిరంజన్, జిల్లా కోశాధికారి అల్లాజీగౌడ్, ఆమనగల్లు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, కోశాధికారి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు మహమూద్, శివలింగం, వెంకన్న, తిరుమలేశ్, జోసెఫ్, జంగయ్య, శేఖర్, ఉపాధ్యాయులు నరేశ్, చలం, లింగం, వెంకటేశ్, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్లు రవికుమార్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.


గంప నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు